PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 71 | 23 మంగళవారం, జూన్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## సిఎం హోదాలో విజయ్ తొలి పుట్టినరోజు

- శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ, సినీ ప్రముఖులు
- ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ, రాహుల్, స్టాలిన్ , పవన్ శుభాకాంక్షలు

02



## టిటిడితో పాటు అన్ని దేవాలయాల్లో ప్రక్షాళన

- రెండేళ్లుగా వైదికంగా ముందుకు తీసుకెళ్లు ప్రయత్నం
- జగన్ పాలనలో ఆయాలను భ్రష్టు పట్టించారు
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి




**అమరావతి,జూన్22(ప్రజా సీమ):**

దేవాలయాలు సమాజంలో భాగమని, అక్కడి కార్యక్రమాలు ప్రజల్లో భాగమని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. టీటీడీతో పాటు అన్ని దేవాలయాలను ప్రక్షాళన చేయడంతో పాటు వైదికంగా ముందుకు తీసుకెళ్లడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి చెప్పారు. మిగతా 2లో...

## లక్నోలో భారీ అగ్నిప్రమాదం..!

- కోచింగ్ సెంటర్‌లో మంటలు..14మంది దుర్మరణం
- తోణమే చర్యలకు దిగిన యూపి సిఎం యోగి
- ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి


**లక్నో,జూన్22(ప్రజా సీమ):**



ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీ గంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో లోపల ఉన్న విద్యార్థులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ఐదుగురు నుంచి ఏడుగురు విద్యార్థులు భవనం నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఎనిమిది ÷రిరజన్లతో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పలువురు విద్యార్థులు భవనంలో చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిప్రమాదంపై స్పందించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మిగతా 2లో...

# రాష్ట్రంలో... కుట్రలు పన్నే పార్టీలు

- ప్రజల సమస్యల పరిష్కారంలో మానవీయకోణం ముఖ్యం
- రాజకీయం రంగు పులుముతున్న నేతలు
- ఫేక్ ప్రచారాలపై ఉద్యోగులు అప్రమత్తం కావాలి
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు హెచ్చరిక



**అమరావతి,జూన్22(ప్రజా సీమ):**

రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని.. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. వివిధ ఘటనలకు కులమతాల రంగు పులుముతున్నారని.. వాటిని వివాదాస్పద అంశాలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీజీఎస్‌పై సమీక్షలో భాగంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులు, అధికారులను బద్నాం చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు అన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నారని వ్యాఖ్యానించారు. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారని, శిక్షలు కూడా పడుతున్నాయని చెప్పారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. మిగతా 2లో...



## సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు

- ప్రజలను మోసం చేస్తున్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్
- ఆయనది ద్వంద్వ వైఖరి అంటూ మండిపడ్డ అంబటి రాంబాబు

**అమరావతి,జూన్22(ప్రజా సీమ):**

సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు ప్రతి విషయంలోనూ డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ప్రజలను, బాధితులను మోసం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు.

మిగతా 2లో...



## సాయికృష్ణ లాకప్ డెత్ కేసును సీబీఐకి అప్పగించాలి

- స్వతంత్ర దర్యాప్తు సాగితేనే కూటమి ప్రభుత్వంపై నమ్మకం
- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్

**చిత్తూరు,జూన్22(ప్రజా సీమ):**

సాయికృష్ణ లాకప్ డెత్ కేసును సీబీఐకి అప్పగించాలని వైసీపీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి డిమాండ్ చేశారు.

మిగతా 2లో...



# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి

- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా కృషి
- ఎపి రూపురేఖలు మార్చేలా చంద్రబాబు వేగంగా అడుగులు
- ఢిల్లీ సదస్సులో మంత్రి లోకేశ్ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్22(ప్రజా సీమ):**

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేష్ గర్వంగా ప్రకటించారు.

మిగతా 2లో...



# రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- యూరియా ఎమ్మార్పీ ధరలకే అమ్మాలి
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక

**అమరావతి,జూన్22(ప్రజా సీమ):**

రైతులను ఇబ్బంది పెడితే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, కంపెనీలపై కూడా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఖరీఫ్-2026 ఎరువుల లభ్యత, పంపిణీపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు, ఎరువుల కంపెనీ, అసోషియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. యూరియా, డీఏపీతో కాంప్లెక్స్ ఎరువుల బలవంతపు విక్రయాలు ఆపాలన్నారు. మిగతా 2లో...

## మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

- డ్రోన్‌లతో వరుస దాడులతో రష్యా ఉక్కికిబిక్కిరి

**మాస్కో,జూన్22(ప్రజా సీమ):**

రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దాని పరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు.

మిగతా 2లో...

# రాష్ట్రంలో...కుట్రలు పన్నే పార్టీలు

మొదటిపేజీ తరువాయి

తప్పుచేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడని హెచ్చరించారు. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంచ్ చేసేలోపు క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్కు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదులను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో పని చేసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలతో వ్యవహరించే సమయంలో సౌమ్యంగా, మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. దీనివల్ల పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఉద్యోగులు తమ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని చెప్పారు. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనలను అదుపు చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని సీఎం పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులు, భూకేటాయింపులు ఎంత వేగంగా జరుగుతున్నాయో వివరించడానికి మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక రక్షణ ప్రాజెక్ట్ కోసం కేవలం 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని సేకరించి అప్పగించాం.గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే పట్టాలెక్కించి ప్రభుత్వ స్పీడ్‌ను నిరూపించాం. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో మన రాష్ట్ర గొంతు ఎంతో బలంగా వినబడుతోందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌ను మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి లోకేష్ వివరించారు. విశాఖపట్నం ఐటీ హబ్‌గా, అమరావతి నాలెడ్జ్ హబ్ గా, రాయలసీమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారబోతున్నాయని అన్నారు. రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# టిటిడితో పాటు అన్ని దేవాలయాల్లో ప్రక్షాళన

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి సూచనలు, సలహాలతో అత్యంత పవిత్రమైన ఆలోచనతో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఆధ్యా త్మిక, సనాతన పరిరక్షణ కేంద్రాలుగా అనేక ఆలయాలను తీసుకువచ్చామని తెలిపారు. రెండేళ్ల పాలన గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలనేది ముఖ్యమంత్రి అభిమతమని.. దానిలో భాగంగా వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖలో రెండు సంవత్సరాల ప్రగతిపై ఆనం మాట్లాడుతూ.. 2019-24 మధ్య రాష్ట్రంలో విచ్ఛిన్నకరమైన వాతావరణం ఉందని విమర్శించారు. దేవాలయాలు సమాజంలో భాగమనే విషయాన్ని నాడు మర్చిపోయారని మండిపడ్డారు. 2024లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభించాలని భావించినప్పుడు అప్పటికే భక్తులు, హిందూ బంధువులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రామతీర్థంలో శ్రీరామ చంద్రుడి శిరచ్ఛేదం, దుర్గమ్మ క్షేత్రంలో వెండిసింహాలు మాయం, అంతర్వేదిలో రథం దగ్ధం వంటి అనేక సంఘటనలు నాడు జరిగాయని గుర్తుచేశారు. నాడు ఆ ప్రభుత్వం కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాయం తక్కువ ఉన్న ఆలయాల్లో దీపం వెలిగించే పరిస్థితి నాడు లేదని.. దీంతో ఆయా ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రతినెలా పదివేల రూపాయలు ఇస్తున్నట్లు చెప్పారు. 692 ఆలయాల్లో పనులను ప్రారంభించామని.. కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు సమకూర్చుతున్నామని చెప్పారు. టీటీడీ సౌలభ్యంతో రాష్ట్ర దేవాదాయ శాఖ ద్వారా భజన మందిరాలు నిర్మాణం చేయాలని నిర్ణయించామన్నారు. దేవాదాయ శాఖలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. మన మిత్రా వాట్సాప్ గ్రూప్ ద్వారా అనేక సేవలు దర్శనం, ప్రసాదాలు, వసతి కల్పన చేస్తున్నామన్నారు. అంతా ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేయడంతో భగవంతుడి పేరుతో చేసే మోసాలను చాలా వరకూ తగ్గించగలిగామని చెప్పారు. డిజిటల్ వ్యవస్థతో దేవాలయ సేవల పట్ల ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చాక 970 ధర్మకర్తల మండలిలను నియమించామని తెలిపారు. 449 ఆలయాలకు పాలకమండలిని నియమించాలన్నారు. రాబోయే రోజుల్లో 65 ఆలయాల్లో అన్నప్రసాద వితరణకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు చెప్పారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రి దేవాలయంలో నకిలీ టికెట్ల వ్యవహారంపై అంశంపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. గతంలో సమర్పించిన నివేదికలు పూర్తిస్థాయిలో లేవని భావిస్తున్నామని, అందుకే కొత్తగా విచారణ చేపట్టాలని నిర్ణయించామని స్పష్టం చేశారు.

తప్పు చేసిన అధికారులు, బాధ్యులు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జగన్ హయాంలో ఆలయాల్లో జరిగిన అక్రమాలు, పరిపాలనా లోపాలపై కూడా సమగ్రంగా పరిశీలిస్తున్నామని అన్నారు. గతంలో నివేదికలు సమర్పించిన అధికారుల పాత్రపైనా విచారణ చేస్తామని పేర్కొన్నారు. దేవాదాయ శాఖకు చెందిన భూముల పరిరక్షణపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ఆనం స్పష్టం చేశారు. గతంలో జమిందారులు, ఇనాందారులు ఆలయాల నిర్వహణ కోసం భూములను కేటాయించేవారని, ప్రస్తుతం అలాంటి ఇనాం భూములు వేల ఎకరాల మేర ఉన్నాయని తెలిపారు. జగన్ హయాంలో నిర్లక్ష్యం కారణంగా ఆలయాల ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని మంత్రి ఆనం ఆరోపించారు. ప్రస్తుతం అలాంటి భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. దేవాదాయ శాఖ రికార్డుల ప్రకారం లక్షల ఎకరాల ఆస్తులు గుర్తించామని, భూముల వివాదాలకు సంబంధించిన సుమారు 2 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# సిఎం హోదాలో విజయ్ తొలి పుట్టినరోజు

మొదటిపేజీ తరువాయి

**చెన్నై,జూన్22(ప్రజా సీమ):** తమిళనాడు రాజకీయాల్లో ప్రభంజనం సృష్టిస్తూ ఎన్నికల్లో పోటీచేసిన తొలిసారే విజయాన్ని సాధించిన విజయ్ ముఖ్యమంత్రి హోదాలో సోమవారం పుట్టినరోజు చేసుకున్నారు. దీంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం రాత్రి శివకాశిలో గంటసేపు బాణాసంచా కాల్చి అభిమానులు సందడి చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు దీర్ఘాయుష్షుతో జీవించాలని ప్రార్థిస్తున్నాను అంటూ ప్రధాని మోదీ సందేశం తెలిపారు. విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. అన్ని ప్రయత్నాలలో మీరు విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. తమిళ ప్రజల హక్కులు, గౌరవం, ఆకాంక్షలను పరిరక్షించడంలో, రాష్ట్ర ప్రగతి కోసం కలిసి పనిచేయడంలో నేను మీకు అండగా నిలుస్తానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా. మీరు చేపట్టే అన్నీ ప్రయత్నాల్లో విజయం సాధించాలని.. ప్రజలకు ఇలానే సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియచేశారు. విజయ్ మీరెప్పుడూ ఆరోగ్యంతో ఉండాలని.. ప్రజలకు సేవను కొనసాగించడానికి అవసరమైన శక్తిని పొందాలని కోరుకుంటూ.. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్. కోట్ల మంది ప్రేమను సొంతం చేసుకున్న తమ్ముడు విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు అని నటుడు కమల్ హాసన్ తెలిపారు. హ్యాపీ బర్త్‌డే విజయ్ సర్. ఈ సంవత్సరమంతా మీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నానని నటి నయనతార శుభాకాంక్షలు తెలిపారు. నా సోదరుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ నటి ఖుష్బూ తెలిపారు.

# రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

మొదటి పేజీ తరువాయి

రైతులకు అవసరమైన ఎరువులనే అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవసరమైన మేర కన్నా అధిక ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి చెప్పారు. యూరియా సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎరువుల బుకింగ్ యాప్ నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, అధిక ఎరువుల వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. ఎమ్ఆర్‌పీ ధరకే యూరియాను విక్రయించాలని, ఎమ్ఆర్‌పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లకు మంత్రి హెచ్చరిక జారీ చేశారు. యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండాలన్నారు. గతంలోలా అక్రమాలు, ఇబ్బందులు సృష్టిస్తే ఉపేక్షించబోమని.. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



# సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు

మొదటిపేజీ తరువాయి

ఒకవైపు ప్రభుత్వం సాయికృష్ణ కుటుంబాన్ని పిలిపించి న్యాయం చేస్తామని చెబుతుంటే.. మరోవైపు పవన్ కళ్యాణ్ ఏమో సాయికృష్ణను ఒక క్రిమినల్ అని మాట్లాడుతున్నారని అన్నారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ తీరుపై అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అదే సమయంలో జనసేన నేత సామినేని ఉదయభాను సాయికృష్ణ తల్లిని ఓదార్చేందుకు వెళ్లి.. పవన్ కళ్యాణ్ పంపిస్తేనే వచ్చామని చెబుతున్నారు. అసలు పవన్ ఏం చెప్పాలను కుంటున్నారో ఆయనకే తెలియాలి అని అన్నారు. వైసిపి నేతలను తాటతీస్తామంటూ పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇలా మాట్లాడొచ్చా? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా? అసలు ఎవరు గూండాలు? పవన్ గారూ.. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరని స్పష్టం చేశారు. 'నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం' అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని అంబటి ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని గుర్తు చేశారు. సాయికృష్ణ కేసులో ఒక అధికారి విచారణ జరుపుతుండగా హఠాత్తుగా 'సిట్' వేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకనే ఈ నాటకాలు ఆడుతున్నారని, ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని అంబటి రాంబాబు దుయ్యబట్టారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూ.. మరోవైపు ఈ కేసులో నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దని ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సాయికృష్ణ లాకప్ డెత్ కేసును సీబీఐకి అప్పగించాలి

మొదటిపేజీ తరువాయి

చిత్తూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నమ్మాలంటే ఈ కేసుపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని అన్నారు. సాయికృష్ణ నిజంగా నేరస్తుడే అయితే కోర్టులు శిక్షించి ఉండేవని నారాయణస్వామి పేర్కొన్నారు. టెర్రరిస్టులను ఎన్‌కౌంటర్ చేసిన సందర్భాల్లో కూడా వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తారని గుర్తు చేశారు. సాయికృష్ణ తల్లి తన కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని, అయితే ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమెను పిలిపించి మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందని విమర్శించారు. తమిళనాడులో జరిగిన పోలీసుల లాకప్ డెత్ ఘటనలపై కోర్టులు తీవ్ర వ్యాఖ్యలు చేశాయని, అదే విధంగా సాయికృష్ణ కేసులో కూడా పూర్తి స్థాయి విచారణ జరగాలని నారాయణస్వామి కోరారు.. అలాగే క్రాంతికుమార్‌ను సీఐ నాగరాజ్ వేధించిన అంశాన్ని కూడా సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ పాలన వల్లే క్రాంతికుమార్, సాయికృష్ణ మృతికి కారణమైన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన ఆరోపించారు. హోంమంత్రి శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను విస్మరించి ముఖ్యమంత్రి చంద్రబాబు భజనకే పరిమితమయ్యారని విమర్శించారు. తిరుపతిలో మంత్రి లోకేష్ రెడ్‌బుక్ గురించి ప్రస్తావించిన తర్వాత పోలీసులు మరింత రెచ్చిపోతున్నారని ఆరోపించారు. తనను రెడ్‌బుక్‌తో పాటు ఎన్ని పుస్తకాల ద్వారా ఇరికించేందుకు ప్రయత్నించినా తాను భయపడబోనని నారాయణస్వామి స్పష్టం చేశారు. తనపై అవినీతి ఆరోపణలు చేయలేమని గతంలో చంద్రబాబే చెప్పారని గుర్తు చేశారు. ఇక, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కూడా నారాయణస్వామి విమర్శలు గుప్పించారు. పవన్ సినిమా నటుడని, ఆయన ఎప్పుడు ఏమి మాట్లాడతారో ఆయనకే తెలియదని వ్యాఖ్యానించారు. ముందుగా కూటమి నాయకులపై ఉన్న క్రిమినల్ కేసులపై చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్‌ను కోరారు. మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కిలోకు రూ.4 మద్దతు ధర కూడా వైసీపీ చేపట్టిన పోరాటాల ఫలితమేనని నారాయణస్వామి అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం వైసీపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు వైసీపీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి.

# లక్నోలో భారీ అగ్నిప్రమాదం..!

మొదటి పేజీ తరువాయి

ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. లఖ్‌నవూ కోచింగ్ సెంటర్ అగ్నిప్రమాద స్థలాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. అగ్నిప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కొంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి నివేదిక అందించాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), అదనపు ప్రధాన కార్యదర్శి (హోం)లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

మొదటి పేజీ తరువాయి

సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు. విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకు పడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

ప్రజాసీమ

# విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

- మదనపల్లె యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులుగా రమణ,మునిగోపాలకృష్ణ నియామకం

- విశ్రాంత పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడి







మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె పట్టణం,స్థానిక జీఆర్టీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోషిమేట్ అధ్యక్షులు గురు రాజారావ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు జయరామ్ నాయుడు,అమరావతి జెఏసి కో-చైర్మెన్ టి.గోపాల్,శంకర్,అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ రెడ్డి,శంకరయ్య,కేశవరెడ్డి,సుబ్రమణ్యంల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించ బడ్డాయి.ఈ ఎన్నికల్లో మదనపల్లె యూనిట్ అధ్యక్షులుగా బివి రమణ,ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ,కోశాధి కారిగా పిసి తిమ్మయ్య,ఆర్గనైజింగ్ సెక్రటరీగా జగన్ మోహన్,అసోసియేట్ అధ్యక్షులుగా సి.ఆర్ శ్రీనివాసులు,కె.రాజన్న,ఉపాధ్యక్షులుగా శకుంతల,శివప్రసాద్,పి.సుబ్బరాజు,కార్యదర్శులుగా సరస్వతి,మక్బూల్ బాషా,గౌస్ బాషా,ఈసి మెంబర్లుగా ధనలక్ష్మి,జయలక్ష్మి,సలహాదారులుగా రెడ్డెప్ప,డాక్టర్ గొల్లపూడి తిరుపతి రావులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నిక కాబడిన ఈసి సభ్యుల ద్వారా ప్రమాణ స్వీకారం చేయించడం జరిగిందని,అలాగే నూతన కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపి పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పరస్పరం కలిసి పనిచేయాలని కోరారు.అనంతరం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పెన్షనర్లు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర నాయకత్వానికి పూర్తిగా సహకరిస్తామని వెల్లడించారు.

# సచివాలయాలపై జగన్ ఫోటోలను తొలగించండి

## -ప్రజలకు కనపడేలా సచివాలయం పేరు భవనాలపై రాయండి

## -చిట్వేలి పట్టణ టిడిపి అధ్యక్షులు పగడాల వెంకటేష్

చిట్వేలి(ప్రజా సీమ)






చిట్వేలి మండలంలో స్వర్ణ సచివాలయాలపై ఇప్పటికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఫోటోలు శిలాఫలకాలు వేసి ఉండడం ప్రజాస్వామ్యంలో ఇలాంటివి చేయడం ప్రజలకు ఎలాంటి సంకేతాలు ఇవ్వాలని ఈ సచివాలయాలకు ఇప్పటికీ జగన్మోహన్ రెడ్డి, ఫోటోలను ఉంచారని వెంటనే వాటిని తొలగించాలని సచివాలయాలు పేర్లు ప్రజలకు కనపడేలా ఉండాలని. చిట్వేలి గ్రామపంచాయతీ టిడిపి అధ్యక్షులు పగడాల వెంకటేష్, టిడిపి తెలుగు యువత నాయకుడు తుంగ చందు, అన్నారు. సోమవారం, చిట్వేలి పట్టణంలోని ప్రధాన కార్యాలయాల మధ్యలో ఉన్న స్వర్ణ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామ సచివాలయం బయట గోడకు అతికించి ఉన్న శిలాఫలకంపై మాజీ ముఖ్యమంత్రి ఫోటోను తొలగించాలని చిట్వేలి మండల ఎంపీడీవో శ్రీనివాసులు, తో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, గ్రామ స్వర్ణ సచివాలయాలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో అభివృద్ధి వైపు తీసుకు వెళుతున్న తరుణంలో ఇప్పటికీ సచివాలయాలపై జగన్మోహన్ రెడ్డి, ఫోటో అలాగే ఎందుకు ఉంచారని వాటిని తొలగించాలని కోరినట్టు వారు వెల్లడించారు. మండల వ్యాప్తంగా ఉన్న స్వర్ణ గ్రామ సచివాలయాలపై ఫోటోలు ఉండకూడదు అని వారు అధికారులను కోరినట్లు తెలిపారు. గ్రామ సచివాలయం అంటే ఆ పేరుకు ఎంతో విలువ ఉంటుంది ఆ అర్హత ప్రజలకు మాత్రమే ఉంటుంది ప్రజల కోసమే నిర్మించబడ్డ ఆ యొక్క భవనంపై ప్రజల సేవలకు సంబంధించిన వాటిపై ప్రజలు వచ్చినప్పుడు అక్కడి అధికారులు స్పందిస్తూ సేవలందించాలని వారు కోరారు. అలా కాకుండా ఇప్పటికీ సచివాలయాలపై ఆయన ఫోటోలు ఉంచడం ఎంతవరకు సబవని వారు ప్రశ్నించారు. రాష్ట్రం అభివృద్ధి వైపు వెళు తుంటే చూసి ఆనంద పడాలి తప్ప వేలెత్తి చూపిస్తూ వక్రబుద్ధితో ఆలోచించే వారి ఫోటోలు ఇంకా పెట్టడం ఎక్కడ న్యాయమన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో జరుగుతుందా అని ప్రశ్నించారు. వెంటనే స్వర్ణ గ్రామ సచివాలయాలపై జగన్మోహన్ రెడ్డి ఫోటోలను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. వారితోపాటు టిడిపి నాయకులు సువారపు నాగేశ్వర, పలువురు టిడిపి కార్యకర్తలు టిడిపి ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు అద్భుత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కులాలను రెచ్చగొట్టి విడగొట్టడమే వైసీపీ నైజం

## ఎమ్మెల్యే అరవ శ్రీధర్

చిట్వేలి(ప్రజా సీమ)

చిట్వేలి జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం,జరిగిన పత్రికాసమావేశంలో రైలుకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ,పత్రికా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మా అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ , ప్రజా సంక్షేమ అభివృద్ధి పాలన స్పీడ్ ను చూసి ఓర్వలేక కులాలను రెచ్చగొట్టి విడగొట్టడమే ధ్యేయంగా పెట్టుకొందని అరవ శ్రీధర్ ఘాటుగా స్పందించారు. దేశం, సమాజం బాగుండాలని అనుకునే వాడిని కులాల చట్రంలో బందించవద్దు అని పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలను వక్రీకరించి వైసీపీ నేతలు తప్పుగా చూపుతున్నారు. శ్రీ కాళహస్తిలో జనసేన కార్యకర్త కొట్టె సాయిని పోలీసు అధికారి కొడితే మా నాయకుడు వెళ్లి పరామర్శిస్తే కూడ మాట్లాడుతున్న వైసీపీ కుహనా మేధావులకు ఒక్కటే చెబుతున్న కొట్టె సాయి కొరకు తిరుపతి వచ్చి ఎస్పీ తో మాట్లాడి ధైర్యం చెప్పడం సాయి ఒక్కడికే కాదు యావత్ జనసేన శ్రేణులకు మా అధ్యక్షుడు ఇచ్చిన ధైర్యం అన్నారు.. ఈ రోజు అదే కొట్టె సాయి అనే ఒక సామాన్య కార్యకర్తను శ్రీకాళహస్తి ఛైర్మెన్ అందలం ఎక్కించారు పవన్ కళ్యాణ్ , జగన్ మోహన్ రెడ్డి, అ స్థాయి పదవి ఒక కార్యకర్తకు ఇచ్చాడా, ఇవ్వగలడా అని సూటిగా ప్రశ్నించారు.. కాపులకు వైసీపీ చేసింది శున్యమని ఇదేళ్ల వైసీపీ పాలనలో కాపు కార్పొరేషన్ ను నిర్వీర్యం చేశారని, కాపు కల్యాణ మండపాల నిర్మాణం ఆపేశారని, కాపు విద్యార్థులకు స్కాలర్ షిప్పులు, విదేశీ విద్యకు సహకరించ లేదని దుయ్యబట్టారు.. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ఈ కులాల కార్చిచ్చును ఆపాలని లేకుంటే 11 నుంచి శున్యానికి పడిపోవడం తథ్యమని హితవు పలికారు... ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మాట్లాడుతూ కులం లేదు అంటూ పవన్ కళ్యాణ్ గారు పిఠాపురంలో ఎందుకు పోటీ చేశారు అనే వైసీపీ వితండవాదులకు సూటిగా బదులిస్తూ మీ నాయకుడు జగన్ రెడ్డి పులివెందులలోనే ఎందుకు పోటీ చేస్తున్నారు మరో చోట పోటీ చేయచ్చు కదా అని ప్రశ్నిస్తూ మా నాయకుడు పిఠాపురం వదలి రాయలసీమలో వెంకటేశ్వర స్వామి, సన్నిధిలో తిరుపతిలో పోటీ చేస్తారు మా నాయకుడిపై పోటీ చేసే సత్తా మీ జగన్ రెడ్డికి, ఉందా అని సవాల్ విసిరారు.. కాపులకు ఈ డబ్ల్యూ ఎస్, రిజర్వేషన్ ఇచ్చేది లేదు అని జగన్ రెడ్డి సామర్లకోటలో ప్రకటించినప్పుడు ఈ వైసీపీ నాయకులు ఎందుకు మాట్లాడలేదు కాపులకు అన్యాయం చేస్తూనేఉన్న జగన్ రెడ్డి దగ్గర ఎందుకు పాలేర్లు గా ఊడిగం చేస్తున్నారో తెలపాలన్నారు.. ఆఖరికి మా ఊరికి రోడ్డు వేయండి అని అడిగిన వెంగయ్య అనే కాపు యువకుడిని ఆ నాటి ఎమ్మెల్యే అమ్మ, ఆలి అని బూతులు తిట్టాడు ఆ వేదనతో వెంగయ్య చనిపోతే ఈ వైసీపీ కాపునేతలు ఎందుకు సమావేశం నిర్వహించలేదు, కోనసీమలో కాపు ఇళ్లమీద దాడులు చేస్తే మీరు ఎక్కడున్నారు అని నిలదీశారు. చివరగా మీరు ఎన్ని మీటింగులు పెట్టిన ఎన్ని పగటివేశాలు వేసిన, పొర్లుదండాలు పెట్టిన నిజాయితి పరుడైన పవన్ కళ్యాణ్ గారితోనే కాపులు నడుస్తారని ధీమా వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో మాదాసు నరసింహ, మద్దూరి మన్మధ,పెద్దంగారి సాయి, కావేరి అవినాష్, , మాదాసు శివ, ఆనందల తేజ కొనిశెట్టి చక్రి, సువారపు హరిప్రసాద్, మాదినేని రాజా ,తదితర జనసేన మరియు కాపుయువత పాల్గొన్నారు.




# ప్రజల సమస్యలుపరిష్కారమే మా లక్ష్యం

## రైతన్నలకు అందుబాటులో ఉండి సహకరిస్తాం

## తాసిల్దార్ నరసింహారావు

చిట్వేలి(ప్రజా సీమ)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడడమే మా లక్ష్యం అని ప్రభుత్వానిబంధనలు పాటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కై కృషి చేస్తామని చిట్వేలి తాసిల్దార్ నరసింహారావు, వెల్లడించారు. సోమవారం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాసిల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీదారులకు గౌరవంగా వారి సమస్య వినడం అధికారులుగా మనందరి బాధ్యత అన్నారు. ఎన్నో కష్టాలు పడుతూ పంట పండించుకుండే రైతన్నకు రెవెన్యూ శాఖ నుండి వారికి అందుబాటులో ఉండి సేవలందించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. భూ సమస్యలు వాటి పరిష్కారం దిశగా ఒక నెల నాలుగు సందర్శనలు కార్యక్రమం ద్వారా కూడా ఈ యొక్క ప్రజా సమస్యల పరిష్కారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు నిర్భయంగా మీ యొక్క సమస్యలను నేరుగా కార్యాలయానికి వచ్చి వినతులు అందించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రామ్మోహన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నిఖిల్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గిరిధర్, హౌసింగ్ ఏఈ సుధాకర్, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.




# విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలి

రాజంపేట (ప్రజా సీమ)

రాజంపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ముఖ్యంగా రాజంపేట, కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలు మరియు పెనగలూరు మండలాల లోని వినియోగదారులకు తెలియజేయడమేమనగా రేపటినుండి అనగా 23.06.2026 నుండి 21.07.2026 వరకు 220 కెవి సబ్ స్టేషన్ రాజంపేట నందు రెండవ ఎల్ ఐ ఎల్ వో ( లైన్ ఇన్ లైన్ ఔట్) అనగా అదనపు కొత్త లైన్ ను 220 కేవి సబ్స్టేషన్ కు అనుసంధానం చేయడం జరుగుతున్నది. ఈ వ్యవధిలో ఒకే లైన్ మీద విద్యుత్ సరఫరా జరుగును ఇందులో ఏదైనా అనుకోని సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు నాలుగు లేదా ఐదు గంటలు విద్యుత్ సరఫరా లో అంతరాయం వచ్చే అవకాశం ఉన్నది కావున సదరు వినియోగ దారులు పై పనులు సజావుగా జరుగుటకు విద్యుత్ శాఖకు సహకరించవల సిందిగా మనవి చేయడమైనది. కనుక విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించవలసిందిగా విద్యుత్ అధికారులు కోరారు.

# నూతన తాసిల్దార్ విజయ్ కుమార్ ను ఘనంగా సత్కరించిన టిడిపి నాయకులు

## బీసీ సెల్ రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు కాడే చెంచయ్య నాయుడు

సిద్ధవటం( ప్రజా సీమ )

మండల కేంద్రమైన సిద్ధవటం తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం మండల తాసిల్దార్ విజయ్ కుమార్ ను రాజంపేట బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కాడే చెంచయ్య నాయుడు శాలువతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా మండల తాసిల్దార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారం కొరకు కృషి చేస్తానని పల్లెల్లో ఏదైనా రెవెన్యూ సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు



# వచ్చే నెలలో ఉచిత ఆధునిక కృతిమ కాలు అమరిక శిబిరం

## - అర్హులైన వారు పేర్లు నమోదు చేసుకునే అవకాశం

## - వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి

మదనపల్లె (ప్రజా సీమ):

దివ్యాంగులకు ఉచిత ఆధునిక కృతిమ కాలు అమరిక కోసం అర్హులైన వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి కోరారు.దీనిపై ఆయన స్పందిస్తూ పేరు నమోదు కొరకు అన్నమయ్య జిల్లా వికలాంగుల,వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిషోర్ ఆదేశాల మేరకు ఉచిత ఆధునిక కృతిమ కాలు అవసరమైన ప్రతి దివ్యాంగుడు మరియు దివ్యాంగు రాలు తన పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకుగాను బి ఎం.హుసేన్, డి.రమేష్ ఫోన్ నంబర్స్ 8074623993, 9182778324, 9701733292, 08562-295480ను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క దివ్యాంగుడు, దివ్యాంగురాలు సద్వినియోగం చేసుకోవలసిందిగా వికలాంగుల,వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిషోర్,వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి సూచించారు.



ప్రజాసీమ

# సూపర్ స్టార్ కృష్ణ అభిమానికి ఆర్థిక సహాయం

గుంటూరు( ప్రజా సీమ):

ప్రముఖ నటుడు కృష్ణ సీనియర్ అభిమాని గుమ్మడి రవికృష్ణ ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన వీరనారాయణ కి మే నెల సహాయము కింద 10116 రూపాయలు కృష్ణ సీనియర్ అభిమానులు గుంటూరుకు చెందిన చిష్టీ, సురభి యేసు, రాజేంద్ర, శ్రీను, టి వెంకటరమణ, ప్రొద్దుటూరు మహమ్మద్ రఫీ ఎడిటర్, మరియు కడప కు చెందిన పుచ్చగింజల హరికృష్ణ సమక్షంలో గుంటూరు నారాయణ కి నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ నెల కృష్ణ అభిమానుల ద్వారా పోగుచేసిన డబ్బులను అభిమానులకు అందజేయడం జరుగుతుంది అని ఇందులో భాగంగా మే నెలకు సంబంధించి నారాయణ కు అందజేయడం జరిగింది అని తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ తన తోటి సూపర్ స్టార్ కృష్ణ అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఘనంగా ముత్తూరు తేజేశ్వర్ నాయుడు జన్మదిన వేడుకలు

సిద్ధవటం( ప్రజా సీమ)

మండలం లోని పెద్దపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని భాకరాపేట గ్రామంలో సీనియర్ జర్నలిస్ట్ ముత్తూరు నగేష్ నాయుడు తమ్ముడు అయిన నాగేంద్ర,లక్ష్మీ ప్రసన్న దంపతుల కుమారుడు ముత్తూరు తేజేశ్వర్ నాయుడు ద్వితీయ సంవత్సరం పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. జన్మదిన ఆనందోత్సాహాల మధ్య కుటుంబ సభ్యులతో కలిసి భారీ కేక్ కట్ చేసి చాక్లెట్లు పంచడం జరిగింది. జన్మదినాన్ని జరుపుకుంటున్న ముత్తూరు తేజేశ్వర్ నాయుడును, నగేష్ నాయుడు ఆశీర్వదించడం జరిగింది. వీరితో పాటు తన కుటుంబ సభ్యులు, గ్రామంలోని బంధువులు స్నేహితులు పిల్లలు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని తేజేశ్వర్ నాయుడు ని ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆనందోత్సవాల మధ్య వైభవంగా జరుపుకోవడం జరిగింది





# ఓటరు నమోదు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలి

## - వైసీపీ స్టేట్ బీసీ కమిషన్ నాయకుడు శేషాచలపతి వెల్లడి

మదనపల్లె (ప్రజా సీమ) :

ఓటరు నమోదు,ధృవీకరణ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ స్టేట్ కమిషన్ నాయకుడు శేషాచలపతి అధికారులను కోరారు.సోమవారం చిప్పిలిలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పరిశీలించి,ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైందని,ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటును నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలన్నారు.ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని పేర్కొన్నారు.యువత,మహిళలు,కొత్త ఓటర్లు పెద్దఎత్తున నమోదు ప్రక్రియలో పాల్గొని తమ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితాల పరిశీలన,ధృవీకరణ కార్యక్రమాలను ప్రజల సహకారంతో పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో కోళ్లబైలు మాజీ సర్పంచ్ బయ్యారెడ్డి,చిప్పిలి నాగరాజ,మల్లికార్జున రెడ్డి,కొత్తపల్లి నాగార్జున నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# డెత్ జోన్ లో మరో "ప్రమాదం"

-ఇద్దరి ఒక చిన్నారితో సహా మరొకరి ప్రాణాలు తీసుకున్న జాతీయ రహదారి -మృత్యు మార్గంగా కడప-తిరుపతి హైవే:

-పుల్లంపేట సమీపం ఉడుమువారిపల్లి వద్ద ఘోర బస్సు-లారీ ఢీ

-9 నెలల చిన్నారి, 16 ఏళ్ల విద్యార్థిని సహా ఇద్దరు మృతి,-16 మందికి తీవ్ర గాయాలు





పుల్లంపేట,(ప్రజా సీమ)

కడప-తిరుపతి-చెన్నై జాతీయ రహదారి మరోసారి నెత్తురోడింది. సోమవారం తెల్లవారుజామున ఉడుమువారిపల్లి సమీపంలో తిరుపతి నుంచి కడప వెళ్తున్న ఆర్టీసీ అల్ట్రా డీలక్స్ బస్సును ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొన్న దారుణ ప్రమాదంలో ఒక్క 9 నెలల చిన్నారి, ఒక 16 ఏళ్ల బాలిక మృతి చెందారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. బస్సు ఎడమవైపు పూర్తిగా ధ్వంసమై, సీట్లు చెల్లాచెదురుగా భయానక దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు డ్రైవర్ ప్రమాదాన్ని తప్పించడానికి ప్రయత్నించినా, లారీ వేగం మరియు బలంగా ఢీకొట్టడం కారణంగా బస్సు ఎడమవైపు తీవ్రంగా దెబ్బతిని ప్రమాద స్థాయి తీవ్రతను పెంచింది స్థానికులు, పోలీసులు తక్షణం సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు. లారీ డ్రైవర్ మత్తులో ఉన్నాడా లేదా నిద్ర మత్తులో ఉన్నాడా అనేది దర్యాప్తు జరుగుతోంది.



ఈ రహదారి ఎందుకు మృత్యుధారి అవుతోంది?

కడప-తిరుపతి హైవే తిరుమల యాత్రికులు, సామాన్య ప్రయాణికులు, వ్యాపారులకు ప్రధాన మార్గం. కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ ప్రమాదాలు రోజువారీ సంఘటనలుగా మారాయి:గత 15 రోజుల్లోనే సీతారాంపేట బ్రిడ్జి వద్ద ఒక వ్యక్తి లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు.రెడ్డిపల్లి వద్ద మరిన్ని ప్రమాదాలు.గతంలో కూడా ఇదే రూట్‌లో బస్సు-లారీ ఢీకొన్న సంఘటనలు ఎన్నో. రోడ్డు స్థితి, వక్రాకారాలు, రాత్రి సమయంలో వేగం, డ్రైవర్ల అలసట, మత్తు -- ఇవన్నీ కలిసి ఈ రహదారిని "డెత్ ట్రాప్"గా మార్చేశాయిప్రయాణికులు భయాందోళనతో "ఈ దారి ఎక్కాలంటే ప్రాణం పోవాల్సిందేనా?" అని ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు కూడా సురక్షితం కావని నిరూపితమవుతోంది.ప్రజల ఆవేదన, ప్రభుత్వం పట్టించుకోవాలి. ఈ జిల్లాకు చెందిన రోడ్డు రవాణా శాఖ మంత్రి ఉన్నప్పటికీ, ప్రమాదాలు కొనసాగుతున్నాయి. సామాన్యుల ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# కూటమి రెండేళ్ల పాలనలో హడావుడి తప్ప అభివృద్ధి శూన్యం

– మెడికల్ కళాశాలను పూర్తిచేసి బీటీ కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలి

– టౌన్ బ్యాంకులో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలి– రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విమర్శలు

మదనపల్లె (ప్రజా సీమ) :



కూటమి పాలనలో ఆర్భాటం ఎక్కువ - అభివృద్ధి తక్కువ అని,వారు అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీ ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మదనపల్లెలో పర్యటించారు. ఇందులో భాగంగా అవెన్యూ రోడ్డులోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిథున్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లో రాకమునుపు మదనపల్లి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అందులో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన మెడికల్ కళాశాల నిర్మాణాలను ఆపివేశారని,బీటీ కళాశాలను యూనివర్సిటీ చేయడంలో విఫలమయ్యారన్నారు.పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన జరగలేదన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి,వైఎస్ఆర్సిపి నాయకులను విమర్శించడం తప్ప వారు చేసింది శూన్యమన్నారు.వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ది కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, స్వయాన ఆ పార్టీ నేతలే తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.కదిరి రోడ్డు నుండి బెంగళూరు రోడ్డును కలుపుతూ బైపాస్ రోడ్డు నిర్మించాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారిని కోరామని,ఇందుకు ఆయన అనుమతి ఇచ్చారని తెలిపారు.అనంతరం మదనపల్లి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ మదనపల్లికి అది చేస్తాం ఇది చేస్తామని గొప్పలు చెబుతున్నారే తప్ప ఆచరణలో పెట్టింది లేదన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మదనపల్లిలో ఫ్లైఓవర్ నిర్మిస్తామని,రోడ్లు విస్తరణ చేస్తామని హడావిడి చేశారని,సిటిఎం రోడ్డు వెడల్పు చేస్తామని చెట్లను తొలగించి సుమారు రెండేళ్లు కావస్తున్న ఆ ఊసెత్తడం లేదని విమర్శించారు.జిల్లా కేంద్రమైన తర్వాత మదనపల్లిలో ట్రాఫిక్ సమస్య పెరిగిందని,దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఇప్పటికైనా కూటమి నాయకులు వైఎస్ఆర్సిపిపై చేయడం మానే అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,జన్నే శేషాచలపతి నాయుడు,వి.ఎస్.రెడ్డి,షమీమ్ అస్లాం,వరపన మనూజా రెడ్డి,ఎస్.ఏ.కరీముల్లా,తట్టి శ్రీనివాసులు రెడ్డి,హర్షవర్ధన్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి,శీలం రమేష్,ఎస్.కె ఇర్ఫాన్,కొత్తపల్లి నాగార్జున నాయుడు,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,మజ్జిగ కేశవ యాదవ్, గుండ్లూరు రఫీ,బీఏ ఖాజా,రాజేష్, శ్రీనివాసులు, కొత్తపల్లి మహేష్ బాబు,చరణ్, నరసింహారెడ్డి, యువ నాయకుడు పవన్ తేజ,చరణ్,శారదా రెడ్డి పెద్దఎత్తున వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# చేనేత సమస్యల పరిష్కారానికై చేనేతల ధర్నా






మదనపల్లె( ప్రజా సిమ) :

ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టరు కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం చేనేత రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీర భాస్కర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మర మగ్గం కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు ప్రకారం చేనేతలకు ఎన్టీఆర్ భరోసా సంవత్సరానికి 25 వేల రూపాయలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు బడ్జెట్ పెంచాలని, చేనేతకు ప్రత్యేకమైన శాఖ మరియు మంత్రి ఏర్పాటు చేయాలని, చేనేతకు ఉపాధి కల్పించే నూతన పనిముట్లు ఇవ్వాలని, బోర్డు ఏర్పాటు చేయాలని, గతంలో ఉమ్మడి ముఖ్యమంత్రి కె కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో చేనేతలకు సిల్క్ సబ్సిడీ రూ. 2000 ఇచ్చారని, అదేవిధంగా సిల్క్ రాయితీ పాసుపుస్తకాలు పెండింగ్లో ఉన్న బిల్లులను అమలు చేయాలి, సబ్సిడీ ఇచ్చి ధరల పెరుగుదల వల్ల ఇబ్బంది పడుతున్న చేనేతలను ఆదుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని చేనేత కార్మికులు నేతన్నలు పట్లా ఎటువంటి నియమ నిబంధనలు లేకుండా చేనేత కార్మికులకు 25000/- రూపాయలు సంక్షేమ పథకాలు అమలు చేయాలని న్యాయమైన డిమాండ్ల తో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముందు ధర్నాలు మరియు మెమోరాండాలు సమర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా అన్నమయ్య జిల్లా లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరిం చారు. చేనేత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా పథకం తో పాటు, సహకార సంఘాలకు ఎన్నికలు జరిపించి ఆదుకోవాలని, రైతులకు మరియు మామిడిపంట రైతులకు ప్రభుత్వం ఆదుకునే విధంగా చేనేతలను సంక్షే పథకాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాదినేని రమేష్ నాయుడు, గాలివీడు మండలం కన్వీనర్ శిబ్యాల వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ బాబ్ జాన్, సలీం . శివ. సుధాకర్ , రమేష్, గుంపు వెంకటేష్, చిన్న కోట్ల రామకృష్ణ , అనంత ఈశ్వరయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసీమ

# సంక్షేమం అభివృద్ధి కోసమే మేము





మూడు పార్టీల సమన్వయంతో రాజంపేటను అభివృద్ధి చేస్తాం.

గొడ్డలి పార్టీ నేతల్లారా కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే తాటతీస్తాం.

మీరు దూరం చేయాలనుకుంటున్న కులాలను మేము మరింత దగ్గర చేర్చుకుంటాం,

అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

రెండేళ్ల ప్రభుత్వ పరిపాలన పై చర్చకు సిద్ధం.

వైకాపా నేతలకు సవాల్

రెండేళ్ల విజయోత్సవ సభలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు

రాజంపేట (ప్రజా సీమ)

అభివృద్ధి కోసం మేము పనిచేస్తుంటే అధికారం కోసం కులాల మధ్య చూపెట్టి రాష్ట్రంలో త శాంతి భద్రతల సమస్యలు సృష్టించేందుకు ప్రతిపక్ష పార్టీలు పనిచేస్తున్నాయని,మూడు పార్టీల సమన్వయంతో ప్రతినెలా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని రాజంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.సోమవారం నాడు స్థానిక ఏ.బి చంద్రారెడ్డి గార్డెన్స్ నందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సమావేశానికి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జనసేన సమన్వయకర్త



అధికారి కృష్ణ లతో కలిసి చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందని తెలియజేశారు. కొంతమంది వైకాపా గొడ్డలి పార్టీకి చెందిన నాయకులు కులాల మధ్య చిచ్చుపెట్టి రాష్ట్రాన్ని ముక్కలుగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అటువంటి వారిని వదిలిపెట్టబోమని చమర్తి హెచ్చరించారు. అన్నమయ్య ప్రాజెక్టును త్వరలోనే పునర్నిర్మాణం చేసి రైతులను అన్ని విధాల ఆదుకుంటామని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. కూటమిలోని నాయకులు,కార్యకర్తలపై వైకాపా నాయకులు ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, అదఃపాతాళానికి తొక్కేస్తామని హెచ్చరించారు.

**కలసికట్టుగా రాజంపేట అభివృద్ధికి పని చేస్తాం: అతికారి కృష్ణ**

జనసేన పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు జైల్లో ఉన్న సమయంలో ఒక్క నిమిషం ఆలోచన చేయకుండా మా నాయకుడు పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వానికి నాంది పలికారు అని తెలియజేశారు. నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో రాజంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ముందు ఉంటామని తెలియజేశారు.

**స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం: నాగోతు**

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోత రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల విజయానికి కూటమిలోని నాయకులు, కార్య కర్తలు అందరూ నడుం బిగించాలని నాగోతు పిలుపు నిచ్చారు. అంతకు ముందు చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దాదాపు 800 కోట్లకు పైగా నియోజకవర్గ వ్యాప్తంగా సంక్షేమం,అభివృద్ధికి వివిధ పనులకు,కేటాయించడం జరిగిందని తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో రాజంపేట తాహసిల్దార్, ఎంపీడీవో, రాష్ట్ర డైరెక్టర్లు,అన్ని మండలాల అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్ లు,సింగల్ విండో చైర్మన్లు ,సొసైటీ డైరెక్టర్లు, క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇన్చార్జిలు ,మాజీ రాష్ట్ర డైరెక్టర్లు , పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం పై ఆర్డీవో కొరడా

-పుల్లంపేట తాహసిల్దార్ కార్యాలయం ఆర్డీవో ఆకస్మిక తనిఖీ..

-నలుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తాసిల్దార్ కు సూచించిన ఆర్డీఓ ?

-రెండు రోజుల్లో పుల్లంపేటకు కొత్త తహసిల్దార్ నియామకం

పుల్లంపేట(ప్రజా సీమ):

తిరుపతి జిల్లా పుల్లంపేట మండల తాసిల్దార్ కార్యాలయాన్ని తిరుపతి రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) రామ్మోహన్ సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సంబంధిత సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడం తో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.
తనిఖీ సమయంలో తహసిల్దార్ కార్యాలయంలో లేకపోవడంతో ఆర్డీవో వెంటనే ఫోన్ ద్వారా సంప్రదించగా, తహసిల్దార్ హుటాహుటిన పుల్లంపేటకు చేరుకున్నారు. అప్పటికే కార్యాలయంలో ఇన్‌ఛార్జి బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారంటూ ఆర్డీవో ఆరా తీశారు. తహసిల్దార్ లేని సమయంలో సీనియర్ అసిస్టెంట్ పీజీఆర్ఎస్ నిర్వహించాల్సి ఉండగా, కార్యాలయంలో ఎవరూ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. “తాడు లేని గాలిపటం వలె పుల్లంపేట రెవెన్యూ కార్యాలయం తయారైంది” అంటూ ఆర్డీవో రామ్మోహన్ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), వీఆర్వోతో పాటు మరో ఉద్యోగికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఇన్‌ఛార్జి తహసిల్దార్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆర్డీవో రామ్మోహన్ మాట్లాడుతూ, పుల్లంపేట మండల పరిధిలో ఇటీవల జరిగిన బస్సు–లారీ ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించేందుకు వచ్చిన సందర్భంగా తిరుగు ప్రయాణంలో మండల కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో కార్యాలయంలో సిబ్బంది లేకపోవడం గమనించి చర్యలకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే పుల్లంపేట మండలానికి రెండు రోజుల్లో కొత్త తహసిల్దార్‌ను నియమించే ప్రక్రియ జరుగుతోందని ఆర్డీవో రామ్మోహన్ తెలిపారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై మదనపల్లెలో వైకాపా సమీక్షా సమావేశం

## - హాజరైన రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె నియోజకవర్గం పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.పట్టణం మరియు మండలాల వారీగా పార్టీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై,ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటరు జాబితా పునాది అని,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రతి ఇంటికీ చేరుకొని ఓటర్ల వివరాలను పరిశీలించాలని,అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల అంశాల్లో ప్రజలకు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. మదనపల్లె నియోజక వర్గం సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసేలా,ఓటర్ల జాబితాలపై రాజకీయ కుట్రలకు పాల్పడే అవకాశాలను అప్రమత్తంగా గమనించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడం,ప్రతిపక్ష అనుకూల ఓటర్లను లక్ష్యంగా చేసుకుని అన్యాయాలకు పాల్పడే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.మాజీ శాసనసభ్యులు డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కుట్రలను ప్రజల సహకారంతో తిప్పికొడుతూ,ప్రతి ఓటు హక్కును కాపాడే బాధ్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు.మాజీ శాసన మండలి సభ్యులు బి.నరేశ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి మండల,పట్టణ స్థాయి వరకు పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ,





ఓటర్ల హక్కులను పరిరక్షించే దిశగా కృషి చేయాలని సూచించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు జరిగినా వాటిని వెంటనే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ప్రజల తరఫున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మదనపల్లె మాజీ మునిసిపల్ చైర్మన్ వి.మనూజా రెడ్డి,ఎస్.ఈ.సి సభ్యురాలు షమీమ్ అస్లాం, జింకా చలపతి,వైఎస్ఆర్సిపి రాష్ట్ర మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శి ఎల్.రఘు నాథ రెడ్డి, కార్యదర్శి వి.ఎస్ రెడ్డి,ఎస్టి సెల్ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఆవుల మల్లికార్జున, హర్షవర్ధన్ రెడ్డి,ఎస్.కె ఇర్ఫాన్,మండల కన్వీనర్లు కేశవ రెడ్డి,కరుణాకర్ రెడ్డి, కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి,ఎంపిపి వెంకటరమణ రెడ్డి,నూర్ అజామ్,బీరంగి రేవతి,తట్టి శ్రీనివాసులు రెడ్డి,కొత్తపల్లి మహేశ్,కొత్తపల్లి నాగార్జున నాయుడు,సర్పంచులు మహేష్,శరత్ రెడ్డి,పారేసి,నాగరాజు రెడ్డి,ఆనంద పార్థ సారథి ,కత్తి రాజు,మాజీ కౌన్సిలర్లు ఎన్.ఇర్ఫాన్ ఖాన్, శ్రీనివాసులు,బి.ఏ ఖాజా,ప్రసాద్ బాబు,పాల్ చంద్రశేఖర్,రేణుక,ఫర్హానా రఫీ,వినుతా బాయి,శారదా రెడ్డి,పార్టీ ముఖ్య నాయకులు,పట్టణ మరియు మండలాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, బీఎల్ఏలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పుల్లంపేట పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్

పుల్లంపేట(ప్రజా సీమ)

తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీఎస్‌వో డాక్టర్ జతీంద్ర, డీసీహెచ్‌ఎస్ ఎస్. ఆనంద్ కుమార్‌తో కూడిన బృందం పుల్లంపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ఎస్. శేఖర్, డాక్టర్ ఎస్. అశ్విని చంద్ర మరియు వైద్య సిబ్బందితో కలిసి ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను సమీక్షించారు. ఓపీ, ఐపీ సేవలు, ఈహెచ్‌ఆర్, ఈ–ఔషధి, ఐవీఆర్‌ఎస్ వినియోగ శాతాన్ని మరింత పెంచాలని, ఆసుపత్రి ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా సిబ్బంది సమయ పాలన పాటించాలని, హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, ల్యాబ్ రిజిస్టర్‌తో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో నిర్వహణ, సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యుడు ఓబులేసు పిహెచ్సి సిబ్బంది ఫార్మసిస్ట్ కృష్ణయ్య మహేష్ .సుబ్బారెడ్డి. ప్రసన్న కుమార్ స్వర్ణ లత లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.




# సైనికులు,వారి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

## - అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం

మదనపల్లె (ప్రజా సీమ) :

దేశ రక్షణ కోసం సేవలందించిన సైనికులు,వారి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక కోటా కింద ఇంటి స్థలాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు కలెక్టర్ అందజేశారు.మదనపల్లె మండలం కురవంక గ్రామానికి చెందిన దివంగత వీరజవాన్ బి.సాయితేజ భార్య బి.శ్యామలకు ప్రభుత్వం ప్రత్యేక కోటా కింద ఇంటి స్థలం మంజూరు చేసింది.ఈ మేరకు మదనపల్లె మండల పరిధిలో 0.06 సెంట్ల భూమికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను బి.శ్యామలకు జిల్లా కలెక్టర్ అందజేశారు.అలాగే యుద్ధంలో అంగవైకల్యం పొందిన మాజీ సైనికుల కోటా కింద మదనపల్లె మండలం ప్రశాంత్‌నగర్‌కు చెందిన మాజీ హవనీర్ వి.సుబ్బారెడ్డికి కూడా 0.06 సెంట్ల భూమికి సంబంధించిన ఇంటి స్థలం మంజూరు ప్రొసీడింగ్స్‌ను కలెక్టర్ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల సేవలను ప్రభుత్వం ఎల్లప్పుడూ గౌరవిస్తుందని,వారి కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు కొనసాగిస్తుందని తెలిపారు.దేశం కోసం సేవలందించిన సైనికులు,మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.



# చైతన్య సంస్థలో బహుజన సేన శ్రీ చందు పుట్టినరోజు వేడుకలు

## - చిన్నారులు,వృద్ధులకు అన్నవితరణ కార్యక్రమం

మదనపల్లె (ప్రజా సీమ) :

ఆంధ్రప్రదేశ్ బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ చందు జన్మదిన సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని చిన్నారులు,ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అన్నదాన వితరణ చేసి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రెటరీ ఏ.కవితా రాణి మాట్లాడుతూ ఉద్యమకారుడు సమస్య అంటే వేగంగా పరిష్కరించే వ్యక్తి చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు పలువురు దాతలను పరిచయం చేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న శ్రీ చందుకి ప్రతి సంవత్సరం ఆయన పుట్టినరోజు వేడుకుని ఇక్కడ జరుపుకోవడం ఆనవాయితీ,సంస్థలోని చిన్నారులంటే మక్కువ ఎక్కువ వారి కోసం ఏం చేయడానికన్నా సిద్ధపడతారన్నారు.చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ప్రభుత్వ స్థలాన్ని గత ప్రభుత్వంలో కబ్జాకు గురైనప్పుడు కూడా బహుజనసేన అధ్యక్షులు శ్రీ చందు సంస్థలోని పిల్లలు,వృద్ధుల కోసం ఆరు రోజులపాటు కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగిన నిరసనకు సంఘీభావం తెలిపి పిల్లల స్థలం వాళ్లకి పిలిచేందుకు కృషి చేశారని కొనియాడారు.కొన్ని అనివార్య కారణాల వలన శ్రీ చందు సంస్థకు రాకపోయినా ఆయన పుట్టినరోజు వేడుకలు ఇలా అల్పాహారంతో పిల్లలు మరియు వృద్ధులు సంతోషపడుతూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్,సంస్థ జనరల్ సెక్రెటరీ ఏ.కవితా రాణి,కోశాధికారి పట్నం గిరిజమ్మ,ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు జనార్ధన రెడ్డి,ప్రసన్న,భార్గవి మరియు బహుజనసేన సభ్యులు పాల్గొన్నారు.




# సంపాదకీయం

## ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన !

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. చినుకు పడడమే కష్టంగా మారింది. నైరుత ప్రవేశించినా చుక్కనీరు చిక్కలేదు. భూములు తడవలేదు. వ్యవసాయం పూర్తిగా పడకేసింది. నదులు నోరెళ్లబెట్టాయి. భూగర్భజలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సాగు ఎలా ఉన్నా తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడేలా ఉంది. కృష్ణా,గోదావరి నదులు వట్టిపోయాయా అన్నట్లుగా మారాయి. ఈ పాటికి గోదావరిలో ఎగువ నుంచి నీరు వచ్చేది. దీంతో సాగు సాగేదెలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో పంటల ఎంపికపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని వాతావరణ శాఖ తెలియచేస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుంటాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే నైరుతి వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో కనిపించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. వాతావరణ మార్పుల కారణంగా నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి. భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, వ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్య మవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

# “రికార్డ్ బ్రేకర్స్” పై చర్యలు ఎప్పుడు?







### -నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులపై దృష్టి సారించరా

### -డీకేటీలలో పేర్ల మార్పు,,,

### -పెనగలూరు మాజీ తాహసిల్దార్ పై చర్యలు ఎప్పుడు?

### -ఫిర్యాదులపై ఉన్నతాధికారులు దృష్టి సారించినా?





**ఏపీ బ్యూరో,(ప్రజా సీమ)**

మనం తరచుగా సినిమా విషయాలలోనూ, క్రీడా విషయాలలోనూ, రాజకీయాలలోను రికార్డ్ బ్రేకింగ్ మాటలు తరచుగా విని ఉంటాం. అయితే రెవిన్యూ శాఖలో కూడా రికార్డ్ బ్రేకింగ్ ద్వారా భారీగా అవకతవకలకు పాల్పడి రెవిన్యూ రికార్డులనే బ్రేక్ చేసి మరి గతంలో పనిచేసిన తాహసిల్దార్ మండలంలోనే అతి తక్కువ సమయంలో రికార్డ్ బ్రేకింగ్ తాహసిల్దారుగా పేరుపొందారు. రికార్డుల తారుమారుతో బ్యాంకు బ్యాలెన్స్ ను అమాతం పెంచుకొని, ప్రభుత్వ భూములను అప్పనంగా ఇతరులుగా అప్పగిస్తూ, డీకేటి భూములను నిబంధనలకు విరుద్ధంగా పేర్లను తారుమారు చేస్తూ ఒక తాహసిల్దార్ భారీగా వెనకేసుకున్నారని ప్రజలు ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేసినా, ఆ తాహసిల్దార్ ఒక మారుమూల మండలం నుండి ప్రమోషన్ మీద మంచి విలువైన మండలానికి బదిలీ అవ్వడంతో ప్రజలు ఇదేమి చోద్యమంటూ తిరిగి ఆ తాహసిల్దార్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ మొదలు పెట్టారు. ఇంతకీ అది ఏ మండలం అనుకుంటున్నారా రైల్వే కోడూరు నియోజకవర్గం లోని మారుమూల మండలమైన పెనగలూరు.

**ఆన్లైన్, ఆఫ్లైన్ కార్డులు బ్రేక్,,**

మండలం పరిధిలోని ప్రభుత్వ భూముల ఆన్‌లైన్ రికార్డుల్లో గతంలో మార్పులు జరిగినట్లు స్థానిక ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మార్పులు చేసిన అప్పటి పెనగలూరు తాహసిల్దార్, ఇప్పటి చంద్రగిరి నియోజకవర్గం లో పనిచేస్తున్న తాహసిల్దార్ పై చర్యలు తీసు కోవాలని అనేకసార్లు ఫిర్యాదు చేసినా, ఉన్నత అధికారులు పట్టించుకోలేదని ఈ అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో మండలంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల హయాంలో ప్రభుత్వ భూములకు సంబంధించిన కొన్ని రెవెన్యూ ఆన్‌లైన్ భూ రికార్డుల్లో మార్పులకు గురయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, ఈ అంశంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివ

# కడప తమలపాకులకు భౌగోళిక సూచీ గుర్తింపునకై దరఖాస్తు

## – మిట్స్ వైస్-ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ వెల్లడి





**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇంస్టిట్టే ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో “కడప తమలపాకులు (కడప బెటల్ లీవ్స్ - కలిపట్టు)కు భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్ కోసం అధికారికంగా దరఖాస్తు సమర్పించబడినట్లు వైస్-ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి చెందిన మిట్స్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ (మిట్స్ - ఐ.పి.ఎఫ్.సి) సాంకేతిక మరియు విధానపరమైన మద్దతుతో ఈ దరఖాస్తు సమర్పించబడిందని ఆయన పేర్కొన్నారు.కడప జిల్లాలోని ఓబులవారిపల్లి,రాజంపేట,చెన్నూరు మండలాలు మరియు అన్నమయ్య జిల్లాలోని కొన్ని అనుబంధ సాగుప్రాంతాల్లో పండే తమలపాకులు ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు,అనుకూల వాతావరణం,సారవంతమైన ఎర్ర మరియు అల్యూవియల్ నేలలు,అలాగే సంప్రదాయ బరోజు సాగు విధానాల వల్ల విశిష్ట గుర్తింపును సంపాదించుకున్నాయన్నారు.ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన నీడ నిర్వహణ,సేంద్రీయ ఎరువుల వినియోగం,శాస్త్రీయ సాగు పద్ధతులు మరియు సరైన సమయంలో చేతితో కోత చేపట్టడం వల్ల ఈ తమలపాకులు ప్రకాశవంతమైన ఆకుపచ్చ రంగు,మెరిసే ఉపరితలం,మృధుత్వం,సమాన పరిమాణం,ప్రత్యేక ఘాటు రుచి మరియు ఎక్కువ నిలువ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని పేర్కొన్నారు.ఈ లక్షణాలు స్థానిక భౌగోళిక పరిస్థితులు మరియు రైతుల తరతరాల అనుభవానికి ప్రతిబింబంగా నిలుస్తున్నాయని తెలిపారు.ఈ విశిష్ట ఉత్పత్తికి చట్టపరమైన రక్షణ కల్పించేందుకు శ్రీ లక్ష్మి బీటెల్ లీవ్స్ సొసైటీ చెన్నైలోని జీఐ రిజిస్ట్రీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించగా,దాని తయారీ,సాంకేతిక పత్రాల సిద్ధీకరణ,పరిశీలన ప్రమాణాలకు అనుగుణంగా రూపకల్పన మరియు దాఖలు ప్రక్రియలో మిట్స్-ఐ.పి.ఎస్.సి కీలక పాత్ర పోషించిందన్నారు.జీఐ గుర్తింపు లభించడం ద్వారా కడప తమలపాకుల పేరును దుర్వినియోగం చేయకుండా రక్షించడంతో పాటు,అసలైన ఉత్పత్తిదారులకు న్యాయమైన ఆదాయం,మార్కెట్లో విశ్వసనీయత,దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లలో అధిక వాణిజ్య విలువ లభిస్తుందని డాక్టర్ సి.యువరాజ్ పేర్కొన్నారు.ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు దోహదపడిన శ్రీ లక్ష్మి బీటెల్ లీవ్స్ సొసైటీ కంపెనీ లిమిటెడ్,కడప,మిట్స్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ (మిట్స్ - ఐ.పీ.ఎఫ్.సి ) మరియు మిట్స్ ఆర్ అండ్ డి సెల్ వారి కృషిని మిట్స్ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి అభినందించారు.రైతు కేంద్రిత ఆవిష్కరణలు,సంప్రదాయ వ్యవసాయ జ్ఞాన పరిరక్షణ మరియు ప్రాంతీయ ఉద్యాన ఉత్పత్తులకు మేధో సంపత్తి హక్కుల ద్వారా గుర్తింపు తీసుకురావడంలో మిట్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్-ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్,అడ్వైజర్ (ఆర్ అండ్ డి) డాక్టర్ తులసీరామ్ నాయుడు,అసోసియేట్ డీన్ (ఆర్ అండ్ డి) డాక్టర్ పి.శివయ్య,శ్రీ లక్ష్మి బీటెల్ లీవ్స్ సొసైటీ కంపెనీ లిమిటెడ్,కడప ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ

## - ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి- బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ డిమాండ్

**మదనపల్లె (ప్రజా సీమ) :**



మదనపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని విలువైన ప్రభుత్వ (ఏపీఐఐసీ) ఖాళీ ప్లాట్లను పక్కనే ఉన్న కొందరు ప్లాట్ దారులు చట్టవిరుద్ధంగా ఆక్రమించి,అక్రమంగా జరుపుతున్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్,జిల్లా మేజిస్ట్రేట్ కి స్థానిక పారిశ్రామికవేత్తలతో కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు.?ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ మదనపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గతంలో ప్లాట్లు కేటాయించబడి,ఇప్పటికే పరిశ్రమలు నడుపుతున్న కొందరు వ్యక్తులు తమ హద్దులను దాటి,పక్కనే మరియు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఏపీఐఐసీ ఖాళీ ప్లాట్లను చట్టవిరుద్ధంగా ఆక్రమిస్తున్నారని ఆరోపించారు.ఎటువంటి అదనపు కేటాయింపు పత్రాలు లేకుండా రాత్రికి రాత్రే భారీ యంత్రాలతో భూమిని తవ్విస్తూ అనధికారికంగా శాశ్వత నిర్మాణ పనులు సాగిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.రెవెన్యూ మరియు ఏపీఐఐసి అధికారులతో మాస్టర్ ప్లాన్ ఆధారంగా క్షేత్రస్థాయిలో సరిహద్దుల సర్వే నిర్వహించ,చట్టవిరుద్ధంగా సాగుతున్న అక్రమ తవ్వకాలను,నిర్మాణాలను వెంటనే నిలిపివేస్తూ స్టాప్ వర్క్ ఆర్డర్స్ జారీ చేయాలని,ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి,ల్యాండ్ గ్రాబింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన,క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.?భవిష్యత్తులో కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించడం కోసం కేటాయించిన ఈ ప్లాట్లను ఆక్రమించడం వల్ల కొత్త పారిశ్రామికవేత్తలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పునీత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.అన్నమయ్య జిల్లాలో పారిశ్రామిక రంగానికి గుండెకాయ లాంటి మదనపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ భూములను ఆక్రమణదారుల నుండి కాపాడి,అర్హులైన వారికి న్యాయం చేయాలని ఆయన జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

ప్రజాసీమ

# మోడీ, యోగి ప్రభుత్వాల పహారా – రామ మందిరంలో గజదొంగలు ఎవరు?

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్

**కడప ప్రజా సీమ :**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి కి భక్తులు పరమ పవిత్రంగా సమర్పించిన సుమారు 200 కోట్ల రూపాయల నగదు, వజ్రవైఢూర్యాలు, విలువైన కానుకలను కాజేసిన దొంగలు ఎవరో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ,ఉత్తరప్రదేశ్ లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం వెంటనే బహిర్గతం చేసి దేశ ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. కడపలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. అయోధ్యలో రామ మందిరం హుండీ ఆదాయ, వ్యయం లెక్కలలో వందల కోట్ల రూపాయల తేడా వచ్చినట్లు తీవ్ర దుమారం రేగిందన్నారు. ఈ భారీ దోపిడీ, దొంగతనం, మోసంపై యావత్ దేశంతో పాటుగా, రాములోరిభక్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. ప్రధానంగా భారతీయ జనతా పార్టీ జపించే హిందువులు కూడా తీవ్రంగా కలత చెందారన్నారు. సామాన్య భక్తుడు నుండి ధనవంతుల వరకు కోట్లాది రూపాయలు దేవుడికి కానుకగా సమర్పించారన్నారు. అంతేకాకుండా శ్రీరామచంద్రుడి మెడలో హారం ఇతర ఆభరణాలు కూడా మాయ మైనట్లు ప్రచారం జరుగు తోందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలోని ప్రభుత్వం, ఉత్తర ప్రదేశ్ లో యోగి ప్రభుత్వాల పరిపాలనలో రామ మందిరంలో దొంగలు ఏ విధంగా పడ్డారన్న నిజాలను బయటపెట్టాలని భక్తులు కోరుతున్నారన్నారు. 1990వ సంవత్సరం నుండి ఇప్పటివరకు భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చేరుకు బాబ్రీ మసీదును విధ్వంసం చేసి, అక్కడ రామ మందిరాన్ని నిర్మిం చారన్నారు. అయితే ఆలయ పరిపాలన, నిర్వహణలో ట్రస్టు చైర్మన్ సంపత్ రాయ్, ఇతర ఉద్యోగుల ప్రమేయం పై విమర్శలు వస్తున్నా యన్నారు. కానీ వందల కోట్ల రూపాయల మేర ధనాన్ని లూటీ చేసిన బడా దొంగతనంలో పాలకులు ఉన్నారా, వారి ప్రమేయం ఉందా లేదా మతోన్మాదాన్ని తలకెత్తుకుని హిందువుల ప్రతినిధులుగా చలామణిఅవుతున్న ఆయా సంస్థల ప్రతినిధుల పాత్ర కీలకంగా ఉందా అనే కీలక వాస్తవాలు బిజెపి ప్రభుత్వాల ద్వారా వెలుగు చూడలేవన్నారు. కేంద్రంలోని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, తదితర కేంద్ర నేర పరిశోధన సంస్థలు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సుప్రీంకోర్టు ద్వారా న్యాయ విచారణ చేస్తే అసలు బండారం బయటపడుతుందని డిమాండ్ చేశారు. రామ మందిరంలో దొంగలు పడినట్లు, భక్తులు సమర్పించిన నగదు, అత్యంత ఖరీదైన కానుకలు దొంగతనం పై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై దేశ ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారన్నారు. ఉత్తరప్రదేశ్ లోని బిజెపి ప్రభుత్వం నియమించిన సిట్ పై భక్తులు, ప్రజలకు నమ్మకం లేదన్నారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ 50 కోట్ల భూమి కొనుగోలు లావాదేవీలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కానీ అక్కడ పనిచేసే ఉద్యోగులు, ఆలయ నిర్వాహకుల వెనుక ఈ భారీ దోపిడీలో ఎవరి ప్రమేయం ఉందన్న వాస్తవాన్ని ప్రజలకు వెంటనే తెలియజేయవలసిన అవసరం ఉంద న్నారు. హిందూ మతం, హిందువులపై గుత్తాధిపత్యం చలాయించే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ , హిందూ ప్రచార సభ, ఇతర హిందూ సంస్థలు రామ మందిరంలో జరిగిన దోపిడీ, గజ దొంగతనం పై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ భారీ దొంగతనం, కుట్ర, దోపిడీని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ పలు సందేహాలు లేవనెత్తుతున్నా రన్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన రామ మందిరంలో గజదొంగతనం లో బడా బాబుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ గజ దొంగతనంతో భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రామ మందిరానికి పరమ పవిత్రంగా భక్తజనం సమర్పించిన కానుకులకు కూడా కూడా బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల పరిపాలనలో భద్రత కరువైందన్నారు. ఈ భారీ గజదొంగతనం ఇంటి దొంగల పనే అయినప్పుడు ఇంటి దొంగలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ పెద్దలు ఎవరు అనే సత్యాన్ని ప్రజలకు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్పీ, కేవలం రాజకీయాలు చేస్తూ, హిందువులను మభ్యపెడుతూ వారి ఓట్ల ద్వారా అధికారం సాధించి మోసం చేస్తున్నారు. వారికి నిజమైన హిందూమత సంప్రదాయ బద్ధమైన గుణం, ఆచరణ లేదన్నారు. హిందు వులను ఓటు బ్యాంకుగా ఆర్ ఎస్ఎస్ బిజెపి కలిపి వాడుకుంటున్నార న్నారు. అంతేగాని భక్తులు ఎంతో భక్తితో దేవుడికి సమర్పించే కానుకలను కైంకర్యం చేసే దొంగలను ప్రోత్సహిస్తున్నా ఉన్నారు. ఇది ఎంతవరకు సమంజసం మని భక్తకోటి ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. హిందు వులు ,హిందూ మతంపై భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ కు ఉన్న నిబద్ధత ఏమిటో రామమందిరం భారీ గజ దొంగ తనం ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధులు ఎస్. హమీద్ , కమల్ భాష తదితరులు పాల్గొన్నారు.



# మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు పరామర్శించిన శాసన సభ్యులు దేవ వరప్రసాద్

**జూన్ 22, రావులపాలెం (ప్రజా సీమ విలేఖరి) :**

మాజీమంత్రి వర్యులు గొల్లపల్లి సూర్యారావు ద్వితీయ కుమారుడు గొల్లపల్లి సూర్య వరప్రసాద్ అనారోగ్యం తో ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా రాజోలు నియోజ కవర్గ శాసన సభ్యులు దేవ వరప్రసాద్ సూర్యారావు ను పరామర్శించి, సూర్యవరప్రసాద్ చిత్ర పటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. ఈ కార్యక్రమం లో మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్ద కాపు, చాగంటి స్వామి, రాష్ట్ర బి సి ఫైనాన్స్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాస్, ఓడూరి రాజా తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 15 వినతులు

**విశాఖ/మధురవాడ(ప్రజా సీమ ప్రతినిధి) జూన్ 22:**

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మధురవాడ జోన్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమీషనర్ అయ్యప్ప నాయుడు ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు/వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 15 దరఖాస్తులు అందాయి.పట్టణ ప్రణాళిక విభాగంకు 04, నీటిసరఫరా విభాగంకు 06,?ఈఈ వర్క్స్ కు 04,పబ్లిక్ హెల్త్ విభాగంకు 00, విద్యుత్ విభాగంకు 00, ప్రజా ఆరోగ్య విభాగంకు 00,రెవిన్యూ విభాగంకు 00, అడ్మినిస్ట్రేషన్ విభాగంకు 01 దరఖాస్తులు నమోదయ్యాయి. ఫిర్యాదులను తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పలు విభాగం అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఫిర్యాదుల్లో ప్రధానంగా ఐదవ వార్డు కొత్త పాలెంలో జీవీఎంసీ అనుమతులు లేకుండా కడుతున్న నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని దాసరి సతీష్ అభ్యర్థించారు. మారికవలస, అయ్యప్ప నగర్, శారదా నగర్, అప్ హిల్స్ గృహల తాగునీరు సరఫరా సమస్యను పరిష్కరించాలని పిన్నింటి రాజారావు కోరారు. స్వతంత్ర నగర్ అంబేద్కర్ పబ్లిక్ పార్క్ సమీపంలో సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని అక్కిరెడ్డి దివ్య జ్యోతి వినతి పత్రం ఇచ్చారు.



# జనసేన నేతలకు మతి భ్రమించింది

## వైఎస్సార్‌సీపీ నేత జమ్మలమడక నాగమణి మండిపాటు

**జగన్‌కు సవాల్ చేసే స్థాయి నానాజీకి ఉందా?**

**పవన్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారో ముందు చెప్పండి**

**కూటమి వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే అసందర్భ సవాళ్లు**

**కాకినాడ రూరల్, జూన్ 22**

**(ప్రజా సీమ విలేఖరి):**

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జనసేన నేతలు మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేసిన ఆమె, జగన్ ఎక్కడి నుంచి పోటీ చేయాలో చెప్పే స్థాయి పంతం నానాజీకి లేదని స్పష్టం చేశారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నానాజీ విసిరిన సవాళ్లను ఖండిస్తూ, కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, ఆ అసంతృప్తి నుంచి జనం దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. ?మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాబోయే ఎన్నికల్లోనూ పులివెందుల నుంచే పోటీ చేస్తారని, ఈ విషయాన్ని తమ పార్టీ నేతలంతా ఖచ్చితంగా చెప్పగలరని నాగమణి పేర్కొన్నారు. జగన్‌కు సవాళ్లు విసిరే ముందు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గత ఎన్నికల్లో ఎక్కడెక్కడ పోటీ చేశారో నానాజీ గుర్తు చేసుకోవాలన్నారు. 2019 ఎన్నికల్లో రెండు చోట్లా పోటీ చేసి వైఎస్సార్‌సీపీ నేతల చేతిలో పవన్ ఓడిపోయిన విషయాన్ని విస్మరిస్తే ఎలా అని ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లో సైతం చివరి నిమిషం వరకు భీమవరం, గాజువాక, విజయవాడ తూర్పు, పిఠాపురం నియోజకవర్గాల్లో పవన్ కళ్యాణ్ ఎన్ని సర్వేలు చేయించుకున్నారో, ఎక్కడ నుంచి పోటీ చేయాలనే దానిపై ఎంత సందిగ్ధంలో ఉన్నారో రాష్ట్ర ప్రజలంతా గమనించారని గుర్తు చేశారు. జగన్‌ను కాకినాడ రూరల్‌లో పోటీ చేయాలని సవాల్ చేస్తున్న నానాజీ, వచ్చే ఎన్నికల్లో మీ పార్టీ అధినేత ఎక్కడి నుంచి పోటీ చేస్తారో ముందుగా చెప్పగలరా అని నిలదీశారు. ?వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కాపు నాయకులను 'రెడ్డి కాపులు' అంటున్న నానాజీ వైఖరిని తప్పుబడుతూ, మరి కూటమి పార్టీల్లోని నేతలను 'కమ్మ కాపులు' అని అభివర్ణించాలా అని నాగమణి ప్రశ్నించారు. అసలు రాష్ట్ర రాజకీయాల్లో కులాల ప్రస్తావనను అత్యధికంగా తెరపైకి తెచ్చింది పవన్ కళ్యాణ్ కాదా అని ఆమె ఆక్షేపించారు. పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికారంలోకి వచ్చి జగన్మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారని, తొలి ఎన్నికల్లోనే 5 లక్షలకు పైగా ఓట్ల భారీ మెజారిటీతో ఎంపీగా గెలిచి దేశ రాజకీయాల్లో రికార్డు నెలకొల్పిన ఘనత ఆయనదని కొని యాడారు. ఇప్పటికైనా కల్లబొల్లి మాటలతో కాలయాపన చేయడం మాని, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని పంతం నానాజీకి నాగమణి హితవు పలికారు.



# నడకుదురులో ఎమ్మెల్యే పంతం నానాజీ పర్యటన

## కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి తక్షణ ఆదేశాలు

**కరప, జూన్ 22(ప్రజా సీమ విలేఖరి):**

కరప మండలం నడకుదురు గ్రామంలోని భాస్కర్ వెంచర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ తక్షణమే స్పందించారు. స్థానిక ప్రజలు, కూటమి నాయకుల ద్వారా సమస్యలను తెలుసుకున్న ఆయన, సోమవారం స్వయంగా ప్రభుత్వ అధికారుల బృందంతో కలిసి కాలనీని సందర్శించారు. కాలనీ వీధుల్లో కాలినడకన పర్యటిస్తూ, స్థానికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ?ఈ పర్యటనలో భాగంగా రోడ్లు, త్రాగునీరు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక వసతుల కొరతను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు కీలక సూచనలు చేశారు. అలాగే కాలనీలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ వెంటనే సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్ల కాలంలోనే నడకుదురు గ్రామానికి సుమారు 35 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల కోసమే పనిచేస్తుందని, నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఆయన కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. తమ సమస్యలపై ఎమ్మెల్యే చూపిన చొరవ, తక్షణ స్పందన పట్ల భాస్కర్ వెంచర్ కాలనీ ప్రజలు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆకుల లక్ష్మీ సరస్వతి, ఎంపీడీవో జటావల్లభుల శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీటీవో ఎస్ వీ శ్రీనివాసరావు, కరప ఎస్సై తోట సునీతతో పాటు కూటమి నాయకులు గొల్లపల్లి చంద్ర శేఖర్, బండారు మురళి, ముద్రగడ రమేష్, నల్లె ప్రసన్న కుమార్, చీపురుపల్లి జయంద్రబాబు, భవాని శంకర్, యాసలపు విష్ణు , కాలనీ వాసులు పాల్గొన్నారు.



# సర్' పట్ల అప్రమత్తత అవసరం : గంటా

**విశాఖ/ ప్రజా సీమ జూన్ 22:**

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) పట్ల ప్రతి ఒక్క కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులతో వివిధ అంశాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లు ఉంచాలన్న వైసీపీ నాయకుల ప్రయత్నాలను అడ్డుకోవాలని, అదే సమయంలో నిజమైన ఓటు తీసేయకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతి ఓటు ఎంత ముఖ్యమో చెబుతూ.. 1989 ఎన్నికల్లో 9 ఓట్లతో అనకాపల్లి ఎంపీగా పెతకంశెట్టి అప్పలనరసింహం ఓటమి, ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో ఎమ్మెల్యే ఒకే ఒక్క ఓటుతో సాధించిన గెలుపును ఉదహరించారు. సక్రమంగా పని చేయని బి.ఎల్.ఓ.ల గురించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

**30 న మెగా జాబ్ మేళా**

ఈనెల 30 న పీఎం పాలెం సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని గంటా కోరారు. భీమిలిలో ఐటీ, టూరిజం, హౌసింగ్ తదితర ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో ఉద్యోగ కల్పనపై యువతలో చాలా అంచనాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం అడుగుతున్న వారందరూ మెగా జాబ్ మేళా అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానమైన అన్ని కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయని వెల్లడించారు. పార్టీ తరపున అందరూ తమ ప్రాంతాలకు చెందిన యువతకు మేళా గురించి తెలియజేయాలని అన్నారు.

**2 ఏళ్ల విజయాన్ని ఇంటింటికీ చెప్పాలి**

రెండేళ్ల కూటమి ప్రభుత్వ అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రతి ఇంటికి వివరించాలని గంటా అన్నారు. 45 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు ఇవ్వడంతో పాటు సాధించిన విజయాలు తెలియజేయాలన్నారు. ఈ నెల 25 న భీమిలి మండలం అన్నవరం గ్రామం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు నారా లోకేష్ ఈ ఇంటింటి ప్రచారం గురించి కాన్ఫరెన్స్ కాల్స్ లో పార్టీ శ్రేణులను కార్యోన్ముఖులను చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో రోజూ 30 ఇళ్లకు వెళ్లి, రెండేళ్ల పాలనపై వారి అభిప్రాయాలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ నేతలు చిక్కాల విజయ్ బాబు, కసిరెడ్డి దామోదరరావు, పిల్లా వెంకట్రావు, తాత్రాజు అప్పారావు, సరగడ అప్పారావు, కోరాడ రమణ, గాడు చిన్ని కుమారి లక్ష్మి, తమ్మిన సూరిబాబు, జీరు సత్యం, గొలగాని నరేంద్ర, పాసి నరసింగ రావు, నాగోతి సత్యనారాయణ, గరే గుర్నాథ్, కానూరు అచ్యుతరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, పంచదార్ల శ్రీనివాస్, మన్యాల సోంబాబు, లొడగల అప్పారావు, కురుమిన లీలావతి, మామిడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.






# బాలకృష్ణ- కొరటాల కాంబో
# 25న షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం





బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బికె 112'గా ప్రచారంలో ఉంది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఆ వివరాలను చిత్రబృందం పంచుకుంది. జూన్ 25న వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ హాజరు కానున్నారు. మే నెలలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కాజల్ కథానాయికగా నటిస్తుండగా.. మంచు మనోజ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ రెండు సినిమాలను బాలకృష్ణ ఒకేసారి పూర్తి చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## ప్రేక్షకుల దృక్కోణం మారింది
## అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నా: సాయిదుర్గా తేజ్

సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్‌లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.







## కలెక్షన్లలో మా ఇంటి బంగారం దూకుడు
## పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకుల ఆదరణ

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత సమంత నుంచి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ విజయపథంలో కొనసాగుతోంది. మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ మూవీ, వీకెండ్‌లో మరింత జోరు చూపించి భారీ కలెక్షన్లను నమోదు చేసింది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలకు కనిపించే స్థాయిలో 'మా ఇంటి బంగారం'కు ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది. మొదటి రోజు మంచి ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం, శనివారం, ఆదివారం రోజుల్లో మరింత మెరుగైన వసూళ్లను రాబట్టింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం మూడు రోజుల్లోనే మా ఇంటి బంగారం సినిమా ఇండియా వైడ్ నెట్ కలెక్షన్లలో రూ. 23.10 కోట్ల మార్కును దాటేసింది. ఈ మూడు రోజుల్లో సినిమా సాధించిన మొత్తం ఇండియా గ్రాస్ కలెక్షన్లు రూ. 26.69 కోట్లకు చేరాయి.సమంతకు ఉన్న క్రేజ్ కారణంగా ఈ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లోభారీ స్పందన లభించింది. కేవలం తెలుగు వెర్షన్ నుంచే మూడో రోజు రూ. 9.50 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం.కుటుంబ ప్రేక్షకులు, మహిళలు, యువత ఈ చిత్రానికి పెద్ద ఎత్తున థియేటర్లకు రావడంతో అనేక ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయి.ముఖ్యంగా మౌత్ టాక్ సినిమాకు అతిపెద్ద బలంగా మారింది. సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకోవడం, కుటుంబంతో కలిసి చూడదగిన చిత్రంగా ప్రశంసించడం వల్ల వసూళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు భారీ ఓపెనింగ్స్ సాధించడం అరుదుగా కనిపిస్తుంది. అయితే 'మా ఇంటి బంగారం' ఆ రికార్డులను తిరగరాస్తూ, సమంత స్టార్‌డమ్‌కు మరోసారి నిదర్శనంగా నిలిచింది. సినిమాలో సమంత నటన, ఎమోషనల్ సన్నివేశాలు, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చాలా కాలం తర్వాత ఆమె పూర్తి స్థాయి ప్రధాన పాత్రలో కనిపించడంతో అభిమానులు కూడా థియేటర్లకు భారీగా తరలివస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో కుటుంబ భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ అంశాలను సమతుల్యంగా మిళితం చేశారు. ప్రేక్షకులను ఆకట్టుకునే కథనం, సహజమైన పాత్రల రూపకల్పన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి.గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి తదితరులు తమ పాత్రల్లో మెప్పించగా, సమంతతో వారి సన్నివేశాలు సినిమాకు మరింత బలం చేకూర్చాయి. వీకెండ్‌లో అనేక ప్రాంతాల్లో థియేటర్లు హౌస్‌ఫుల్‌గా మారాయి. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన సినిమాను సూపర్ హిట్ దిశగా నడిపిస్తోంది. పలు మల్టీప్లెక్స్‌లతో పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా మంచి ఆక్యుపెన్సీ నమోదవుతోంది.





## పవన్‌తో దర్శకుడు మెహర్ రమేశ్ భేటీ
## కూతరు పెళ్లికి రావాలంటూ ఆహ్వానం

దర్శకుడు మెహర్ రమేశ్.. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిశారు. త్వరలో జరగనున్న తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ ఫొటోలను ఎక్స్ వేదికగా పంచుకున్న దర్శకుడు.. ఎన్నేళ్లయినా పవన్‌తో తన బంధం శాశ్వతమని పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం విజయవాడలో జరిగిన నా పెళ్లికి పవన్ వచ్చి నన్ను ఆశీర్వదించారు. ఈరోజు నేను విజయవాడ వచ్చి నా కుమార్తె పెళ్లికి పవన్‌ను ఆహ్వానించాను. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. కాలం మారుతుంది.. తరాలు మారతాయి.. కానీ మా సోదర బంధం శాశ్వతం' అంటూ పంచుకున్న ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఏపీ రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా ఇటీవల ఏపీ ప్రభుత్వం మెహర్ రమేశ్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన మెహర్ రమేశ్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.




## అనిల్ రావిపూడి మూవీలో ఛాన్స్ అంటూ ప్రకటనలు అవన్నీ ఫేక్..
### నమ్మొద్దంటూ ప్రకటన విడుదల

ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీలోక్రేజ్ ఉన్న దర్శకుల్లో అనిల్ రావిపూడి ఒకరు. ఆయన మూవీలో నటించేందుకు ఎంతో మంది ఆసక్తి చూపుతారు. దీన్నే అదనుగా తీసుకుని కొంతమంది సరికొత్త మోసానికి తెరలేపారు. ఈ విషయం కాస్తా చిత్ర నిర్మాణ సంస్థ దృష్టికి వెళ్లడంతో అవన్నీ ఫేక్ అంటూ ప్రకటన ఇవ్వాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్నది. కీర్తి సురేశ్, కృతిశెట్టి కథానాయికలు. ఇటీవల పూజా కార్యక్రమాలతో ఈ మూవీ మొదలైంది. అంతేకాదు, 'రాయల సీమ నేపథ్యం' అంటూ ప్రచారాన్ని కూడా అనిల్ రావిపూడి వినూత్నంగా ప్రారంభించారు. ఈ క్రమంలో ఇందులో నటించే అవకాశం ఇప్పిస్తామంటూ కొంతమంది సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటనలు ఇవ్వడం మొదలు పెట్టారు. దీంతో అవన్నీ ఫేక్ అంటూ నిర్మాణ సంస్థ ÷న్ స్క్రీన్స్ తెలిపింది. మా సినిమా పేరుతో ఒక నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ కాస్టింగ్ కాల్‌కు, మా చిత్ర బృందానికి ఎలాంటి సంబంధం లేదు. దయచేసి అలాంటి మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. మా సినిమా తరపున కాస్టింగ్ పేరుతో సంప్రదిస్తున్న వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పత్రాలు లేదా డబ్బు ఇవ్వవద్దని విజ్ఞప్తి. మా చిత్రానికి సంబంధించిన ఏవైనా అధికారిక కాస్టింగ్ ప్రకటనలు ఉంటే, అవి కేవలం మా అధికారిక, ధ్రువీకరించిన సోషల్ మీడియా ఖాతాల ద్వారానే ప్రకటిస్తాం. జాగ్రత్తగా ఉండండి. మోసగాళ్ల వలలో పడొద్దని హెచ్చరించారు.



## బాక్సాఫీస్ వద్ద కాక్‌టెయిల్-2 సంచలనం
## భారీ వసూళ్లు రాబడుతున్న మూవీ

బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ మూవీగా థియేటర్లలోకి వచ్చింది 'కాక్‌టెయిల్ 2'. షాహిద్ కపూర్, రష్మిక మందన్న, కృతి సనన్ జంటగా హోమీ అదాజానియా దర్శకత్వంలో వచ్చిన కాక్‌టెయిల్ బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే ఓపెనింగ్స్ రాబట్టింది. మొదటి వీకెండ్‌లోనే ఈ సినిమా ఇండియా వ్యాప్తంగా భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. మూడు రోజుల్లోనే మంచి హోల్డ్ సాధించి ట్రేడ్ వర్గాల్లో పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. ఈ సినిమా బాక్సాఫీస్ ప్రయాణాన్ని గమనిస్తే.. మొదటి రోజు నుంచే సాలిడ్ కలెక్షన్లు నమోదయ్యాయి. మొదటి రోజు రూ. 115.39 కోట్లు, రెండవ రోజు రూ. 19.25 కోట్లు, మూడవ రోజు ఆదివారం రూ. 20.22 కోట్లు రాబట్టి సూపర్ స్ట్రాంగ్ గా హోల్డ్ చేసింది. మొత్తంగా చూసుకుంటే మూడు రోజుల మొదటి వీకెండ్‌లో 'కాక్‌టెయిల్ 2' ఆల్ ఇండియా ట్రాక్డ్ గ్రాస్ కలెక్షన్స్ రూ. 54.86 కోట్లకు అటు ఇటుగా నమోదు చేసింది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma